సాక్షి కరీంనగర్

శుక్రవారం | 13 | జనవరి | 2023



అలరించిన త్యాగరాజ ఉత్సవాలు

వేములవాడ: రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు గురువారం రెండో రోజుకు చేరాయి. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



మోడల్ స్కూల్ పిలుస్తోంది

మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తుకు గడువు ఉంది. IIలో▸

గరిష్టం/కనిష్టం
31.0/13.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లగా ఉంటుంది. తీవ్ర ఈదురుగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విభాగాలకు శిక్షణ



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ జి.చంద్రమోహన్

కరీంనగర్‌క్రైం: బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విభాగాల పోలీసులకు గురువారం కరీంనగర్ కమిషనరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్ మాట్లాడుతూ బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విభాగాల పోలీసులు డయల్ 100 ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వరం స్పందించాలన్నారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచడంతోపాటు రాత్రివేళల్లో సదరు నేరస్తులు ఇళ్లలో ఉంటున్నారా లేదా తనిఖీ చేయాలన్నారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను సందర్శించడంతోపాటు ప్రమాదానికి గల కారణాలను పరిశీలించాలని సూచించారు. విధినిర్వహణలో సమర్థతను చాటుతూ సేవలందించే వారికి ప్రత్యేక రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: గ్రూప్ 2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు కరీంనగర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని.. దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ యం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసైన నిరుద్యోగ అభ్యర్థులు నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు స్టడీ సర్కిల్ వెబ్ సైట్ tsbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23న ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చీకటిపువ్వు నాటికకు బహుమతి

కరీంనగర్ కల్చరల్: హైదరాబాద్ విద్యుత్ సౌధలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగిన రాష్ట్రస్థాయి విద్యుత్‌శాఖ నాటిక పోటీల్లో కరీంనగర్ విద్యుత్ శాఖవారు ప్రదర్శించిన చీకటిపువ్వు నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించిందని కరీంనగర్ విద్యుత్ శాఖ స్పోర్ట్స్, కల్చరల్ జనరల్ సెక్రెటరీ ఈఎల్పీ రాజు ప్రకటనలో తెలిపారు. నటుడిగా రంగు వెంకటనారాయణ, ఉత్తమ దర్శకుడిగా మంచాల రమేశ్ బహుమతులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. నాటికలో రాజమౌళి, మంచాల రమేశ్, ఆంజనేయులు, లహరి, కె.అనిల్‌కుమార్, వెంకటేశ్, రంగు వెంకటనారాయణ పాల్గొనగా, వారిని సూపరింటెండెంట్ ఇంజినీర్ గంగాధర్ అభినందించారని తెలిపారు.

‘సదరం’పై చేతులెత్తేసిన ఏసీబీ..!

- సివిల్ ఆసుపత్రి కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల రాకెట్
- గతేడాది సుమోటోగా స్వీకరించిన ఏసీబీ
- ప్రశ్నావళికే పరిమితమైన అధికారులు
- అనుమానితులపై తూతూమంత్రపు విచారణ
- చివరికి ఏసీబీ విచారణను సైతం అడ్డుకున్న నిందితులు?





Government of Telangana
CERTIFICATE FOR PERSON WITH DISABILITY

సూపరింటెండెంట్ రత్నమాల జారీ చేసిన 100 శాతం వైకల్యం సర్టిఫికెట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ సివిల్ ఆసుపత్రి కేంద్రంగా ‘సాక్షి’ బయటపెట్టిన అనర్హులకు సదరం సర్టిఫికెట్ల స్కామ్ వ్యవహారం ఎంత వేగంగా బయటికి వచ్చిందో.. ఇప్పుడు అంతే వేగంగా మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరి 6న ‘దివ్యంగా దోచేస్తున్నారు’ శీర్షికన సివిల్ ఆసుపత్రిలో కొందరు వైద్యసిబ్బంది, తాత్కాలిక సిబ్బందితో కుమ్మక్కై అనర్హులకు దివ్యాంగ సర్టిఫికెట్లు కట్టబెడుతున్న వైనాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తీసుకువచ్చింది. ఆ తరువాత వరుస కథనాలు వచ్చాయి. దీనికి తమకు సంబంధం లేదని చెప్పిన సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రత్నమాల.. సదరు ఆరోపణలు వచ్చిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు శ్రీనివాస్, కిశోర్‌ను ఈ వ్యవహారానికి బాధ్యులుగా చేస్తూ విధుల నుంచి తప్పించారు. అప్పటికే డీఆర్‌డీఏ వీరిని తొలగించి రెండేళ్లు గడిచినా.. వీరు జీతం లేకుండా.. అనర్హులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తూ స్వేచ్ఛగా దందా కొనసాగించారు. అసలు ఏ వైకల్యంలేని వారికి సైతం 100 శాతం వైకల్యం జారీ చేసిన విధానం చూసి సివిల్ ఆసుపత్రి సిబ్బందే ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలాంటి సర్టిఫికెట్లను గతేడాది ‘సాక్షి’ ప్రచురించినా.. ఇప్పటికీ సదరం వెబ్‌సైట్‌లో అలాగే ఉంచడం గమనార్హం.

విచారణలన్నీ తుంగలోకే..!

‘సాక్షి’ కథనాలతో జిల్లా యంత్రాంగం తప్పనిసరి పరిస్థితుల్లో అప్పటి అడిషనల్ డీఆర్‌డీవో నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. వాస్తవానికి 2015 నుంచి ఉమ్మడి జిల్లా ఉన్నప్పటి నుంచి నకిలీ సర్టిఫికెట్ల దందా నడుస్తోందని ఆరోపణలు ఉన్నా.. కేవలం 2021 జనవరి నుంచి 2022 జనవరి వరకు జారీ అయిన సర్టిఫికెట్లపై మాత్రమే విచారణ జరిగింది. 16 మండలాల్లోనూ విచారణ జరిపిన అధికారులు నివేదికను కలెక్టర్‌కు పంపారు. కానీ, ఈ కేసులో నిందితులుగా ఉన్న అధికారులు చక్రం తిప్పి దాన్ని వెలుగులోకి రానీయలేదు. అధికారుల తీరుపై విమర్శలు రావడంతో మరోసారి మార్కెటింగ్ శాఖలోని ఓ ముఖ్య అధికారితో విచారణ చేయించారు. తర్వాత మరో అధికారి కూడా ఇదే అంశంపై విచారించారు. ఈ ఇద్దరూ ఏం విచారణ చేశారో? ఏం నివేదిక ఇచ్చారో? ఎవరికీ తెలియదు. అంతకు ముందు టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ చేశారు. సదరు సర్టిఫికెట్లపై సివిల్ ఆసుపత్రి కూడా విచారణకు ఓ వైద్యుడిని నియమించింది. ఎన్ని విచారణలు వేసినా ఇంతవరకూ వాస్తవాలు వెలుగుచూడలేదు.

ఏసీబీ ప్రవేశంతో మారిన సీన్..!

ఈ కేసులో సూత్రధారులకు రాజకీయ అండదండలు దండిగా ఉన్నాయి. దీంతో జిల్లా అధికారుల విచారణ నివేదికలను బయటికిరాకుండా తొక్కిపెట్టారు. కానీ.. ఏసీబీ సుమోటోగా కేసు స్వీకరించేసరికి అందరికీ చెమటలు పట్టాయి. ఏసీబీ విచారణ ప్రారంభించాక ఇటు డీఆర్‌డీవో, అటు సివిల్ ఆసుపత్రిలోని కిందిస్థాయి సిబ్బందిని పిలిపించి విచారించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులకు కీలక ప్రశ్నల జాబితా పంపించి సమాధానాలు సేకరించారు. ఆ తర్వాత విచారణ ఊపందుకుంటుందని అంతా అనుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ వ్యవహారాన్ని సుమోటోగా పరిగణించి విచారణకు చేపట్టిన ఏసీబీ అధికారులు తొలుత దర్యాప్తును పరుగులు పెట్టించినా.. ఇప్పుడు ఎటూ కాకుండా స్తంభించిపోయింది. దీని వెనక కొందరి ఒత్తిళ్లే కారణమని గుసగుసలు వస్తున్నాయి. మొత్తానికి అవినీతిపై వేసిన విచారణను పూర్తి చేయడంలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) విఫలమైందన్న విమర్శలను మాత్రం మూటగట్టుకుంటోంది.

ప్రభుత్వానికి రూ.కోట్ల నష్టం..!

సదరం సర్టిఫికెట్ల జారీ వెనక రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. వీటిని వ్యాపారులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఇలా పలువురు అనేక రకాలుగా దుర్వినియోగం చేస్తున్నారు. ఇలాంటి జాబితాలో సామాన్యులు కూడా ఉన్నారు. ఏ వైకల్యం లేకపోయినా.. చెవిటి, అంధ సర్టిఫికెట్లు తీసుకుని ప్రతినెలా ఠంచనుగా ఖాతాలో రూ.3,000 చొప్పున వికలాంగ పింఛన్ పొందుతున్నారు. ఇలాంటి జాబితాలో స్థానిక ప్రజాప్రతినిధుల బంధువులు అధికంగా ఉండటం గమనార్హం. పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు ఇన్‌కం ట్యాక్స్, బదిలీల్లో మినహాయింపు కోసం వీటిని వాడుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ లెక్కన నెలనెలా రూ.కోట్ల నష్టం ఖజానాకు చిల్లులు పడుతోంది. ఈ వ్యవహారంలో కనీసం ఏసీబీతోనైనా న్యాయం జరుగుతుందని భావించినా చివరికి నిరాశే మిగిలిందని సాక్షాత్తూ సివిల్ ఆసుపత్రి సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు.

> ‘317 జీవో అమలు సందర్భంగా వరంగల్ జిల్లాలో బదిలీని తప్పించుకునేందుకు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు అప్పగించిన దాదాపు 40కిపైగా నకిలీ దివ్యాంగ సర్టిఫికెట్లను గుర్తించారు. అందులో 10కిపైగా సర్టిఫికెట్లు కరీంనగర్ సివిల్ ఆసుపత్రి నుంచి జారీ అయినవే. అదే సమయంలో కరీంనగర్‌లోనూ పలు అనుమానాస్పద సర్టిఫికెట్లపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో వాటిని పక్కనపెట్టాలని స్వయంగా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ అనుమానాస్పద సర్టిఫికెట్లు సైతం కరీంనగర్ సివిల్ ఆసుపత్రి ఇచ్చినవే కావడం గమనార్హం’.

చైల్డ్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్‌కు పురస్కారం



కరీంనగర్: కరోనా సమయంలో ఆపదలో ఉన్న పిల్లలకు మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల ద్వారా న్యూట్రిషన్, వైద్య శాఖ ద్వారా ఇమ్యునైజేషన్ ఇంజక్షన్స్ చేరవేయుటలో సేవలందించిన చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్‌కు పురస్కారం వరించింది. నగర మేయర్ వై.సునీల్‌రావు యువసేవ పురస్కార్ అందజేశారు. తనను గుర్తించి అవార్డు ఇచ్చినందుకు సంపత్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సమితి చైర్మన్ చల్ల హరిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్, మున్సిపల్ కమిషనర్ ఇస్లావత్, యువజన సమితి అధ్యక్షుడు సత్తినేని శ్రీనివాస్, కన్వీనర్ రాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి ధర రూ.8,150

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో పత్తి ధరలు రోజు రోజుకు తగ్గుతున్నాయి. మూడు రోజుల క్రితం క్వింటాల్‌కు రూ.8,400 పలికిన ధరలు గురువారం క్వింటాల్‌కు రూ.250 తగ్గి గరిష్ట ధర రూ.8,150 పలికింది. మార్కెట్‌కు 71 వాహనాల్లో 892 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.8,150, మోడల్ ధర రూ.8,050, కనిష్ట ధర రూ.7,550 వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 13 మంది రైతులు 23 క్వింటాళ్లు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,850, మోడల్ ధర రూ.7,600, కనిష్ట ధర రూ.6,000 చెల్లించారు.





ఇంటిబాట..

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రభుత్వం స్కూళ్లు, కళాశాలలకు సెలవులు ప్రకటించింది. దీంతో గురువారం సాయంత్రం విద్యార్థులంతా ఇళ్లబాట పట్టారు. వసతిగృహాల నుంచి పేరెంట్స్‌తో బయలుదేరి వెళ్లారు. మరోవైపు.. బస్టాండ్ సైతం విద్యార్థులతో కళకళలాడింది. పండుగ నేపథ్యంలో సరిపడా బస్సులు లేకపోవడంతో పడిగాపులు కాయాల్సి వచ్చింది. గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. చివరకు ఒకటో రెండో బస్సులు వస్తే ఇలా ఒక్కసారిగా చుట్టుముట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్





బ్రాండ్ పేరిట దోపిడీ

- పుట్టగొడుగుల్లా రైస్‌డిపోలు
- ఇష్టారాజ్యంగా ధరలు.. విక్రయాలు
- తనిఖీల్లేవ్.. నాణ్యత హుష్‌కాకి

‘రంగు సంచులు చూశారుగా.. ఇవే మనం దుకాణాల్లో తీసుకునే సన్న బియ్యం బస్తాలు. బస్తాలపై కర్నూల్ రైస్ ఉండగా కానీ బియ్యం నింపేది మాత్రం ఇక్కడే. వివిధ రకాల బ్రాండ్ల పేరుతో ఆకర్షణీయంగా సంచులను ముద్రించడం వాటిలో బియ్యం నింపడం.. జనాలను దోచుకోవడం దర్జాగా సాగుతోంది’.





‘ఇది నగరంలోని ఓ రైస్‌మిల్లు. వివిధ రకాల ట్యాగులను తగిలించి బియ్యాన్ని నింపుతున్నారు. వివిధ బ్రాండ్లతో సంచులుండగా అందులో నింపే బియ్యం మాత్రం ఒకటే’.

‘నగరంలోని మంకమ్మ తోటలో గల బియ్యం దుకాణమిది. బియ్యం బస్తాలు మిల్లు నుంచి వచ్చినవే. ఇది తెలియని వినియోగదారులు ఆకర్షణీయ రంగు సంచిని చూసి చెప్పినంత ధరకు కొనుగోలు చేస్తున్నారు’.



కరీంనగర్ అర్బన్: వ్యాపారంలో నమ్మకమే పెట్టుబడి కానీ ఆ నమ్మకాన్నే కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. వివిధ బ్రాండ్ల పేరుతో ఇక్కడి బియ్యాన్నే నింపి రంగు సంచులతో బురిడీ కొడుతున్నారు. దర్జాగా దందా చేస్తూ జనాలను పిండుతున్నారు. నిలువరించాల్సిన యంత్రాంగమే లేకపోవడం విడ్డూరం. అధికారుల సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో హోలోగ్రామ్ ఉన్న బియ్యం బ్రాండ్ ఒక్కటీ లేదు. మార్కెట్‌లో మాత్రం వివిధ రకాల పేర్లతో కొన్ని వందల బ్రాండ్లు పుట్టుకొస్తున్నాయి.

బియ్యం మాఫియా

కరీంనగరంలో రెండేళ్ల కిందట 300 వరకు రైస్‌డిపోలుండేవి. కాలక్రమేణా వేయి వరకు వెలిశాయి. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం గడించే వ్యాపారం కావడంతో పలువురు వ్యాపారులు, మిల్లర్లు కలిసి దందాకు తెరలేపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సూపర్‌ఫైన్ క్వాలిటీ ఉండే బియ్యాన్ని కిలో రూ.30 మించి బహిరంగ మార్కెట్లో విక్రయించకూడదు. ఓ పేరు మోసిన బ్రాండ్ కిలో బియ్యాన్ని రూ.60లకు అమ్ముతుంటే ఎటువంటి గుర్తింపు, అనుమతులు లేని మరికొంత మంది బ్రాండ్ అమ్మకందారులు కిలో బియ్యం రూ.55 తక్కువ కాకుండా విక్రయిస్తున్నారు. 25కిలోల బియ్యం రూ.1,300–రూ.1500 వరకు పలుకుతోంది. పంట పండించే రైతు నుంచి 50 కిలోల ధాన్యం బస్తాను రూ.900 మించి కొనుగోలు చేయని వ్యాపారులు వారు తయారు చేసే బియ్యం విషయంలో మాత్రం ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు.

పేరుకే 25కిలోలు.. కానీ 23 కిలోలే

- గింజ పరిమాణం ఎలా కావాలంటే అలా తయారు చేసే ఆధునిక యంత్రాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. రూ.కోటి నుంచి రెండున్నర కోట్ల విలువ చేసే సార్టెక్స్ యంత్రాలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు బియ్యం విక్రయాల్లో అనేక రకాల మోసాలకు పాల్పడుతున్నారు.
- పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు వీరి అక్రమాలపై దృష్టిసారించకపోవడంతో బియ్యం మాఫియా ఆగడాలు జిల్లాలో శృతిమించిపోతున్నాయి. వాణిజ్య పన్నుల శాఖ ఏనాడు తనిఖీలు నిర్వహించిన దాఖలాలే లేవు. 25కిలోల బస్తా 23, 24 కిలోలే ఉంటుండగా తూనికలు కొలతల శాఖ చర్యలు మాత్రం శూన్యం.
- మిల్లులే రంగు సంచులకు అడ్డాలుగా మారుతున్నాయి. వివిధ రకాల బ్రాండ్ల పేరుతో సంచులను మిల్లుల్లో నిల్వ చేసుకుని కొనుగోలు చేసిన ధాన్యాన్ని మరాడించి వీటిలో నింపుతున్నారు. ఇటీవల కాలంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ రాష్ట్ర విభాగం కఠినంగా వ్యవహరిస్తుండటంతో పలువురు ఈ దందాకు తెరలేపారు. ఇదిలా ఉంటే భువనగిరి, మిర్యాలగూడ నుంచి బియ్యం దిగుమతి చేసుకునే వ్యాపారులు ప్రభుత్వానికి శఠగోపం పెడుతున్నారు. రాత్రిళ్లు వేబిల్లు లేని వాహనాలతో బియ్యం రవాణా చేస్తున్నారు.

బియ్యం ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)		
రకం	పాతవి	కొత్తవి
బీపీటీ	3,500	3,100
హెచ్‌ఎంటీ	3,900	3,400
జైశ్రీరామ్	5,100	4,200

చర్యలు చేపడతాం

రేషన్ బియ్యంతో దందా చేసేవారిని వదలం. తనిఖీలు చేసి దొరికితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. రంగు సంచులతో వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం లేదు. తూకంలో తక్కువగా ఉంటే మాకు సంబంధం లేదు.

– కమలేశ్, పౌరసరఫరాల ఇన్‌స్పెక్టర్

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



క్రీడాపాఠశాల విద్యార్థులకు ట్రోఫీలు అందించిన కలెక్టర్

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్‌స్పోర్ట్స్: నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. గురువారం నెహ్రూ యువకేంద్ర, జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రంలో జరిగిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, స్వీయ విశ్వాసంతో కష్టపడితే సాధించవచ్చిన సూచించారు. లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి అన్న వివేకానందుడి వాక్కుల స్ఫూర్తితో యువత కార్యోన్ముఖులు కావాలన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో ఉత్తమ సేవలు అందించిన సదాశివపల్లికి చెందిన యువతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఉత్తమ యువజన సంఘం అవార్డుకుగాను సర్టిఫికెట్, రూ.25వేల నగదు, జ్ఞాపిక అందించారు. అనంతరం 12 యువజన సంఘాలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. జాతీయస్థాయిలో క్రీడల్లో పాల్గొన్న క్రీడా పాఠశాల విద్యార్థులకు మెమొంటోలు ప్రదానం చేశారు. అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ.శ్యాంప్రసాద్ లాల్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజవీరు, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో– ఆర్డినేటర్ వెంకట రాంబాబు, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, శేఖర్, ప్రసాద్, కోచ్‌లు కిష్టయ్య, గణేశ్, పవన్, సాయిరాం, చంద్రశేఖర్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మౌంట్ పతాల్సు పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థులు



మౌంట్ పతాల్సు పర్వతంపై విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: మౌంట్ పతాల్సు పర్వతాన్ని కరీంనగర్‌కు చెందిన ఎస్వీజేసీ ద్రోణాచార్య విద్యార్థులు అధిరోహించారు. ఈ నెల 8న కరీంనగర్ నుంచి బయలు దేరిన బృందం ప్రతికూల వాతావరణంలో కూడా వెనుకంజ వేయకుండా పర్వతాన్ని విజయవంతగా అధిరోహించినట్లు లెంకల మహిపాల్‌రెడ్డి తెలిపారు. పర్వతాన్ని అధిరోహించిన 16 మందిలో అతి పిన్న వయస్సుగల విద్యార్థులు లెంకల ధర్మతేజ (10), లెంకల వివేకానంద (12) ఉండడం విశేషం.

ఆలిండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్‌స్పోర్ట్స్: ఆలిండియా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు కరీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి తుల మధుకర్ ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నేదునూరి శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో మధుకర్ రాణించాడు. ఫిబ్రవరిలో ఆల్ ఇండియా పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా మధుకర్‌ను చైర్మన్ గోవిందవరం కృష్ణ, ప్రిన్సిపాల్ పూరెళ్ల రాజశేఖర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ మునీందర్‌గౌడ్, రమేష్, అధ్యాపకులు అభినందించారు.

సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ



అభినందిస్తున్న స్వప్న, తదితరులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని కస్తూరి బాగాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. విద్యార్థులను స్పెషల్ ఆఫీసర్, గైడ్ టీచర్ అంజలిదేవి అభినందించారు.

డాక్టర్‌పై కేసు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన బాధితురాలి ఫిర్యాదు మేరకు సింగరేణి వైద్యుడు విశ్వమేదపై గురువారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మానసిక వైద్యుడు విశ్వమేద కొంతకాలంగా కాలనీకి చెందిన మహిళతో సన్నిహితంగా ఉంటూ వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

మోడల్ స్కూల్ పిలుస్తోంది

- ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల
- ఫిబ్రవరి 15వరకు దరఖాస్తుకు గడువు



కరీంనగర్: మోడల్ స్కూల్స్‌లో 2023- 24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తుకు గడువు ఉంది. 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఆయా పాఠశాలల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారని పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. 7,8,9,10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగనుంది. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, మిగతావారు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలు వెబ్‌సైట్ http://telanganams.cgg.gov.inలో పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 38 పాఠశాలలు

ఉమ్మడి జిల్లాలో 38 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కరీంనగర్‌లో చొప్పదండి మండలం రుక్మాపూర్, కరీంనగర్ మండలం ఎలగందల్, మానకొండూర్ మండలం పోచంపల్లి, రామడుగు, వీణవంక, జమ్మికుంట మండలం టేకుర్తి, చిగురుమామిడి మండలం ముల్కనూర్, గంగాధర, శంకరపట్నం, తిమ్మాపూర్, సైదాపూర్‌లో ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి 100 సీట్లు ఉంటాయి. 7,8,9,10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు.

దరఖాస్తుల స్వీకరణ వివరాలు

ఈనెల 10నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తుల స్వీకరణ. ఏప్రిల్ 8 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష. మే15న ఫలితాల ప్రకటన, సంబంధిత ప్రిన్సిపాల్స్‌కు మెరిట్ జాబితాల అందజేత. మే 24న మోడల్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపిక జాబితా ఖరారు. అడిషనల్ కలెక్టర్ల ఆమోదం. మే 25 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం.

పరీక్ష విధానం

ప్రవేశ పరీక్షలో వంద మార్కులకు వంద ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. ఆరో తరగతిలో తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆంగ్లం పాఠ్యాంశాల్లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. 7 నుంచి 10వ తరగతులకు గణితం, సామాన్య, సాంఘిక, ఇంగ్లిష్ ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటల పాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం

ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి ఉంది. 9,10వ తరగతులతో పాటు ఇంటర్ చదువుతున్న వంద మందికి మాత్రమే అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం 3 కి.మీటర్లు, ఆపై దూరంగా ఉండేవారు హాస్టల్‌లో ప్రవేశానికి అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఉంది. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్రమశిక్షణ, మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.

– జనార్దన్‌రావు, డీఈవో

అర్బన్ హెల్త్ సెంటర్ ఎంప్లాయీస్ ధర్నా



ధర్నాలో అర్బన్ హెల్త్‌సెంటర్ ఎంప్లాయీస్

కరీంనగర్‌టౌన్: తమ సమస్యల పరిష్కారం కోసం కరీంనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఎంప్లాయీస్ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, గత 20 ఏళ్ల నుంచి అర్బన్ హెల్త్ సెంటర్ స్టాఫ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారని, వీరిని ప్రభుత్వాలు రెగ్యులరైజ్ చేస్తారని ఆశతో అనేక పని ఒత్తిడి, చాలీచాలని జీతాలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వీరి జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 16 ప్రకారం ఎలాంటి షరతులు, పరీక్షలు లేకుండా రెగ్యులరైజేషన్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ హెల్త్ సెంటర్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ముదం రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోల్లవెని రాజు, కోశాధికారి ఊట్ల ప్రశాంత్, నాయకులు సంపూర్ణ, స్వరూప, సంతోషి కుమారి, సాగర్, రజినీకాంత్, ప్రవంతి, సరిత, రజిత, ముభినా, రేణుక, సంధ్యారాణి, మంగ దేవి, సులోచన, లావణ్య పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం చేపడుతున్నందున అధికారులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ రిజ్వీ, కమిషనర్ శ్వేతలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 12,748, పట్టణ ప్రాంతాల్లో 3,788 క్యాంపులను 100 పని దినాల్లో నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి గ్రామ సంఘాన్ని భాగస్వామ్యం చేస్తూ పూర్తిస్థాయిలో వృద్ధులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో క్యాంపుల నిర్వహణ కంటే ముందుగా సంబంధిత ఆశ,ఏఎన్ఎంలు పర్యటించి షెడ్యూల్ వివరాలు తెలియజేస్తూ కంటి వెలుగుపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ, జిల్లాలో 48 బృందాలతో కంటి వెలుగు నిర్వహిస్తామని, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందని, జిల్లాకు ఇప్పటి వరకు 40,100 రీడింగ్ గ్లాసెస్ చేరాయని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నమాల, డీపీవో వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, కంటి వెలుగు నోడల్ అధికారి కేవీ రవీందర్‌రెడ్డి, డాక్టర్ శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనుచూసి హతమార్చింది



తేజనాయక్ మృతదేహం



తండ్రిని కోల్పోయిన చిన్నారులు



వివరాలు తెలుసుకుంటున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

- నిత్యం తాగుడు.. వేధింపులు తాళలేక
- భర్తను హత్య చేసిన భార్య
- గడ్డపారతో కొట్టి దారుణం
- లంబాడితండాలో విషాదం
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- బాలరక్ష భవన్‌కు పిల్లల తరలింపు

ఓదెల(పెద్దపల్లి): భర్త తాగుడుకు బానిసై నిత్యం వేధించడంతో తట్టుకోలేని భార్య అతడిని హతమార్చింది. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి లండాడితండా గ్రామానికి చెందిన గుగులోతు తేజనాయక్(32)ను గురువారం ఉదయం భార్య గుగులోతు కవిత గడ్డపారతో కొట్టి హత్యచేసింది. సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి, పొత్కపల్లి ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. హుస్నాబాద్‌కు చెందిన కవితకు లండాడితండాకు చెందిన గుగులోతు తేజనాయక్‌తో 2010లో వివాహమైంది. కూలీ పనులు చేసుకునే తేజనాయక్ తాగుడుకు బానిసయ్యాడు. నిత్యం తాగి భార్యతో గొడవపడటంతో పాటు వేధించేవాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం తేజనాయక్ తాగి ఇంటి ముందున్న చింత చెట్టు కింద పడుకున్నాడు. దీంతో అదనుచూసిన కవిత ఇంట్లోని గడ్డపారతో తేజనాయక్ ఎడమవైపు మెడపై పొడిచి, విచక్షణ రహితంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు గుగులోతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అతడి తల్లితండ్రులు ఇటీవలే మృతిచెందారు.

నాన్నను నిద్ర లేపేలోపు అమ్మ చంపింది

'తాగి చెట్టుకింద పడుకున్న నాన్నను లేపుదామని వెళ్లేసరికి లేవలేదు. అమ్మ వచ్చి గడ్డపారతో కొట్టి చంపింది' అని మృతుడి కుమారుడు గుగులోతు మహేశ్(9), కూతురు మహదేవి(8), చిన్న కుమారుడు గిరేందర్(5) ఘటన స్థలంలో చెప్పినతీరు అక్కడివారిని కంటతడి పెట్టించింది. 'నాన్నను కొట్టిన తర్వాత అమ్మ ఇంట్లోనుంచి పారిపోయింది. మేము ఊరి బడిలో చదువుకుంటున్నాం. రోజూ ఇంట్లో లొల్లి జరుగుతుంది' అని చిన్నారులు పేర్కొన్నారు.

పిల్లలను చూసి చలించిపోయిన సీఐ

లండాడితండాలో గుగులోతు తేజనాయక్ హత్య స్థలాన్ని సందర్శించిన సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి మృతుడి పిల్లలను చూసి చలించిపోయారు. వారికి బిస్కెట్లు తినిపించారు. వారికి నీళ్లు తాగించి జరిగిన ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పెద్దపల్లి బాలరక్ష భవన్‌కు పిల్లలు

హత్యకు గురైన తేజనాయక్ పిల్లలు మహేశ్, మహదేవి, గిరేందర్‌లను పెద్దపల్లి బాలరక్ష భవన్‌కు తరలించాలని తండావాసులు సీఐ, ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. తేజనాయక్ అంత్యక్రియలు జరిగిన పిమ్మట తీసుకెళ్లాలని బాలరక్ష భవన్ కోఆర్డినేటర్‌కు సీఐ ఆదేశాలు జారీ చేశారు.

స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు

భర్త గుగులోతు తేజనాయక్‌ను హత్యచేసిన కవిత నేరుగా పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. కవితపై హత్యకేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

యువతకు దిక్సూచి స్వామి వివేకానంద



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కోతిరాంపూర్‌లో స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా బీజేపీ శ్రేణులు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గిద్దె పెరమాండ్ల ఆలయ సమీప మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వామి వివేకానంద జీవితం యువతకు దిక్సూచి, స్ఫూర్తిదాయకమన్నారు. 39 ఏళ్లే జీవించినా భారతజాతికి, యువతకు శాశ్వతమార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు, వేదాంత, యోగతత్వ శాస్త్రములలో అత్యంత ప్రభావము కలిగించిన ప్రఖ్యాత ఆధ్యాత్మిక నాయకుడు, హిందూతత్వ చరిత్ర, దేశ చరిత్రలలోనే ప్రముఖ వ్యక్తి, రామకృష్ణ మఠం వ్యవస్థాపకుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. ఆయన వ్యాఖ్యల స్ఫూర్తితో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో కొరటాల శివరామకృష్ణ, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కళ్లెం వాసుదేవరెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, మాడ వెంకటరెడ్డి, బొంతల కళ్యాణ్‌చంద్ర, మర్రి సతీష్, దూలం కళ్యాణ్, కొలగాని శ్రీనివాస్, కచ్చు రవి, పెద్దపల్లి జితేందర్, కాసర్ల ఆనంద్, బండ రమణారెడ్డి, మాడ గౌతంరెడ్డి, మునిగంటి కుమార్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతుకు లాభాలు



మొక్కలు నాటుతున్న అధికారులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని తద్వారా అధిక లాభాలు పొందవచ్చని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మల్యాల గ్రామంలో సిరిసిల్ల జిల్లా వ్యవసాయ అధికారి కటంగూరి రణధీర్‌రెడ్డికి చెందిన 13 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో డీడీఏ, హుజురాబాద్ ఏడీఏ సునీత ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆయిల్‌పామ్ ద్వారా పొందవచ్చన్నారు. మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మొక్కలకు, ఇరిగేషన్, డ్రిప్‌నకు 80 నుంచి 100 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. నాలుగేళ్ల పంట కాలం నుంచి దిగుబడులు వస్తాయని, అంతరపంటలుగా శనగ, మినుము, వేరుశనగ, పెసర, సోయా, నువ్వులు తదితర పంటలు వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు డీడీలు తీసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రజిత, వైస్ ఎంపీపీ ఆరెల్లి జోష్న, సర్పంచ్ గురుకుంట్ల సాంబయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, పుట్ట రాజు, అంతం ఎల్లారెడ్డి, రైతుబంధు కో ఆర్డినేటర్ రమేష్, హెచ్ఓ ఐలయ్య, ఏఈఓఎస్ తిరుపతి, సంపత్, రాకేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఉత్తర్వులు

చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని ముదిమానిక్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావును సస్పెండ్ చేస్తూ వరంగల్ ఆర్‌జేడీ కె.సత్యనారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఉత్తర్వులను జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు గోప్యంగా ఉంచారు. ఉత్తర్వుల ప్రతిని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై పలువురు గ్రామస్తులు విమర్శిస్తున్నారు. పూర్తి వివరాలు.. ముదిమానిక్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆంగ్లమాధ్యమం ఉపాధ్యాయుడు ఖలీలుద్దీన్ గత నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడు. పలుమార్లు ఇలాగే ప్రవర్తించడంతో విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు వివరించగా, గత డిసెంబర్ 29న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 2న కలెక్టర్ విచారణను ఆదేశించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయగా, ఈనెల 3న కలెక్టర్ ఉపాధ్యాయుడు ఖలీలుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడికి పరోక్షంగా సహకరించాడనే అభియోగంపై హెచ్‌ఎం మోహన్‌రావును కూడా వరంగల్ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి జీవో నంబర్ 32-ఏ4-2023 ప్రకారం ఈనెల 4న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి గోప్యంగా ఉంచినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు ఇంకా ఎవరికీ ఇవ్వలేదు.

శ్వాస అందక యువకుడు మృతి



హరికృష్ణ(ఫైల్)

కరీంనగర్‌రూరల్: విద్యుత్ మోటారు మరమ్మత్తు కోసం వ్యవసాయబావిలో దిగిన ఓ యువకుడు పైకి వచ్చేక్రమంలో శ్వాస అందక మృతిచెందిన ఘటన రైతు కుటుంబంలో విషాదం నింపింది. కరీంనగర్ రూరల్ పోలీసుల కథనం.. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన ఎర్ర హరికృష్ణ(31) విద్యుత్ మోటారు చెడిపోవడంతో మరమ్మతు కోసం మెకానిక్ చందుతో కలిసి గురువారం వ్యవసాయ బావిలో దిగాడు. పైపు వేసి బావిపైకి వచ్చేక్రమంలో శ్వాస అందడం లేదంటూ విద్యుత్ మోటారు ఫౌండేషన్ చోట కుప్పకూలిపోయాడు. వెంటనే సమీపంలోని రైతులు ఎర్ర మల్లయ్య, ఏసురెడ్డిలు హరికృష్ణను చికిత్సకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హరికృష్ణకు గతంలో ఓపెన్‌హార్ట్ సర్జరీ జరిగిందని, బావిలో నుంచి పైకి వస్తుండగా శ్వాస అందక మృతిచెందినట్లు తల్లి సరోజన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మానస



మానస

ధర్మారం(ధర్మపురి): ధర్మారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వనం మానస జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మానస ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ నెల 15వరకు రాజస్తాన్‌లోని దీడ్వానలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. ఈసందర్భంగా మానసను ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్, డీవైఎస్ఓ రాజవీరు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



శ్రీనివాస్ (ఫైల్)

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ధర్మారం క్రాస్‌రోడ్డు సమీపంలో ఫోర్‌లైన్ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో దైత శ్రీనివాస్(62) మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. కన్నాల బస్టాండ్ సమీపంలో ఫోర్‌లైన్ రహదారిపై బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారానికి వెళ్లే రైల్వేలైన్ గేట్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా దారిని కన్నాల భారత్ పెట్రోల్ బంక్ నుంచి ధర్మారం క్రాస్‌రోడ్డు వరకు వన్‌వే చేశారు. ఈక్రమంలో సుల్తానాబాద్‌లోని దత్తాత్రేయ రైస్‌మిల్లు యజమాని దైత శ్రీనివాస్ సొంత పని మీద ద్విచక్రవాహనంపై మంచిర్యాలకు వెళ్తుండగా ఎదురుగా గోదావరిఖని నుంచి బొగ్గు లోడుతో వస్తు న్న లారీ ఢీకొంది. ఈప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో రహదారికి ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సుల్తానాబాద్‌లో విషాదం

సుల్తానాబాద్(పెద్దపల్లి): దైత శ్రీనివాస్ మృతితో సుల్తానాబాద్‌లో విషాదం నెలకొంది. రైస్‌మిల్ భాగస్వామి కావడంతో పాటు వివాదరహితుడిగా శ్రీనివాస్‌కు స్వప్నకాలనీలో మంచి పేరు ఉందని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పలు రైస్‌మిల్లుల యజమానులు హుటాహుటిన పెద్దపల్లి ఆసుపత్రికి తరలివెళ్లారు. సహచరుడు ప్రమాదంలో మృతిచెందడం కలిచివేసిందని పలువురు వ్యాపారులు రోదించారు. రైస్‌మిల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సీటి కేశవరావు, మాజీ ఉపాధ్యక్షులు అల్లంకి శ్రీనివాస్, కరుణాకర్, యజమానులు శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరావు, వేణు, కృష్ణ, సురేష్, తిరుపతి బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు లక్ష్మీబిందు



లక్ష్మీబిందును అభినందిస్తున్న ఎంఈవో

కమాన్‌పూర్(మంథని): నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 13,14 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు పెద్దపల్లి జిల్లా జట్టుకు కమాన్‌పూర్ జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న లక్ష్మీబిందు ఎంపికై ట్లు ఎంఈవో సంపత్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ తెలిపారు. ఈ నెల 10న గోదావరిఖనిలో జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా లక్ష్మీబిందును గురువారం ఎంపీవో తదితరులు అభినందించారు.

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...
* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బర్డ్స్ ఆఫ్ కమ్‌చట్‌క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.



యువర్స్

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్



* మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
* పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
* గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలానా ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్

డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..



డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జడ్ **పవర్:** డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
* ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమొరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి
– 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు
– దేవిశ్రీ ప్రసాద్



"వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు" అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

* చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
* బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
* ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడదని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
* ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి
– బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి
– దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.


● రవీంద్ర

దేశం కోసం...

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.